క్లుప్తంగా

30న పీడీఎస్‌యూ నగర, డివిజన్ కౌన్సిల్



కరపత్రం విడుదల చేసిన పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో ఈనెల 30న నిర్వహించే ఏలూరు నగర, డివిజన్ జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల వద్ద ప్రచారం చేసి కరపత్రం విడుదల చేశారు. 2022లో నగర, డివిజన్ జనరల్ కౌన్సిల్ నిర్వహించామని, ఆ కౌన్సిల్‌లో ఎన్నికైన కార్యవర్గం విద్యారంగ సమస్యలపై అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిందని నాని గుర్తుచేశారు. ప్రతి రెండేళ్లకోసారి జనరల్ కౌన్సిల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. పీడీఎస్‌యూ నాయకులు సొంగ సునీల్ కుమార్, వై.శాంతి కిరణ్, సీహెచ్ విజయ్ కుమార్, టి.సుధీర్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌తో నగర ప్రజలకు వినోదం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శనివారపుపేట పాత తివాచి సెంటర్‌లో ఏర్పాటు చేసిన విజయ శ్రీ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నగర ప్రజలకు వినోదాన్ని పంచుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం ఆయన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. పండుగ సెలవుల్లో ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. విజయ శ్రీ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు పప్పల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏలూరు జిల్లా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కేవీ రాఘవులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీవీఎస్ఎస్ రంగనాయకులు, కార్యదర్శిగా బొల్లునేని రాంబాబు, కోశాధికారిగా జి.భాస్కరరావు, మరో ఐదుగురు సభ్యులను ఎంపిక చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కస్తూరిబా స్కూల్ ఎదుట కొత్త స్తంభం ఏర్పాటుకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా
- ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్





వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఈ కార్యాలయం లోపలికి వెళ్లకుండా గేటు వేస్తున్న సిబ్బంది, ఏఓ రమాదేవికి వినతిపత్రం అందిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక రామచంద్రరావు పేటలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పింది ఎప్పుడూ చేయలేదని, ఆరు నెలల కాలంలో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్ నెలలో రూ.6072.86 కోట్లు, డిసెంబర్ నెలలో రూ.9412.50 కోట్లు కలిపి మొత్తం రూ.15485.36 కోట్లు రాష్ట్ర ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. సంపద సృష్టిస్తానని చెప్పిన పెద్ద మనిషి ప్రజలపై వరుసగా ఒక్కొక్కటిగా చార్జీలు పెంచుతూ బతుకు భారం చేస్తున్నారని, రిజిస్ట్రేషన్‌కు సంబంధించి భూముల విలువలు పెంచే నిర్ణయం తీసుకుని పేదల, మధ్యతరగతి ప్రజలు భూములు కొనలేని పరిస్థితి కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలంటూ అలవికాని హామీలిచ్చి, వాటిని అమలు చేయాలంటే భయమేస్తోందని పలాయనం చిత్తగించే బాబు ముఖ్యమంత్రి పదవికే అనర్హుడన్నారు. కరెంట్ చార్జీల పెంపును ఉపసంహరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ

కార్యక్రమంలో పలువురు నాయకుల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బాబు చెప్పిన ష్యూరిటీ అంతా బోగస్ అని, బాదుడు మాత్రం గ్యారెంటీ అని ఎద్దేవా చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పూరి గుడిసెలను సైతం కూటమి ప్రభుత్వం విడిచి పెట్టలేదని, షాకులమీద షాకులిస్తే ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా అథోగతి పాలౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, వ్యవసాయ పంపుసెట్లకు వెంటనే కనెక్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక గో సంరక్షణ సమితి నుంచి పాదయాత్రగా విద్యుత్ ఎస్ఈ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం సిబ్బంది గేట్లు మూసివేయడంతో నాయకులు అక్కడే బైఠాయించారు. బాబు వైఖరి మార్చుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు హామీలన్నీ అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ అదనపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, జిజ్జువరపు విజయనిర్మల, తంగెళ్ల రాము, ఇమ్మానుయేల్ జైకర్, నాయకులు ఇనపనూరి జగదీష్, జేవియర్ మాస్టర్, పల్లి శ్రీను, రాష్ట్ర బీసీసెల్ నాయకుడు కిలాడి దుర్గారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు మున్నుల జాన్ గుర్నాథ్, ముఖ్య నాయకులు గంటా మోహనరావు, లంకలపల్లి గణేష్, జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు స్టాలిన్, ఎండీ ఖైసర్, గాజుల బాజీ, కిలారపు బుజ్జి, బత్తిన మస్తాన్, జనార్ధన్,తంబి, వీరవల్లి లక్ష్మీకుమార్, మేతర సురేష్, జక్కుల బెనర్జీ, తులసి, దాసరి రమేష్, బుద్దాల రాము, భగవాన్, దేవరకొండ నాగేశ్వరరావు, మట్ట రాజు, శివ, సైదు కొండ, సుజన్, వెంకటేష్, గణేష్, పాతినవలస రాజేష్, మద్దాల ఫణి, నారాయణ, సొంగ మధు, కొండపల్లి పరమేశ్వరరావు, కొండల రావు, ఏసుపాదం, రావి నాని, ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, బండ్లమూడి సునీల్, పాలిమేర కిరణ్, బల్ల రమేష్, కోటి, నాగేశ్వరరావు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయకేతనం పుస్తకావిష్కరణ

ఏలూరు(మెట్రో): జిల్లా ప్రజా పరిషత్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికతో రూపొందించిన విజయకేతనం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు 25 వేల విజయకేతనం పుస్తకాలను పేద విద్యార్థులకు అందించనున్నట్టు చెప్పారు. వీటిని వినియోగించుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. గతేడాది కూడా ఈ పుస్తకం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశామని, ఇది ఉత్తీర్ణత శాతం బాగా పెరగడానికి కారణమైందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీఈఓలు ఎం వెంకటలక్ష్మి, నారాయణ, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

ఏలూరు(మెట్రో): మన్మోహన్ సింగ్ ఒక అద్భుతమైన ఆర్థికవేత్త, ఒక వినయశీల నాయకుడు, నిజమైన దేశభక్తుడని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరు జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. మన్మోహన్ సేవలను కొనియాడారు. రెండు జిల్లాల విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

- ఏలూరు (టూటౌన్) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు సంతాపం వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఏలూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తులను, నేరాలను అదుపు చేయడానికి వినియోగించాల్సిన సీసీ కెమెరాలను ఏలూరు నగరంలో ఆటోలపై చలానాలు విధించడానికి ఉపయోగించడం సహేతుకమైన చర్య కాదని విమర్శించారు. ఏలూరులో పరిశ్రమలు మూతపడటంతో నిరుద్యోగ యువత ఆటో డ్రైవర్లుగా ఇతర రవాణా రంగ కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడాన్ని సీఐటీయూ స్వాగతిస్తుందని, అదే క్రమంలో జీవనోపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఏలూరు టౌన్ అండ్ రూరల్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.రాజు, బి.చంద్రశేఖర్ కోశాధికారిగా ఎం వీరరాఘవులు, వైస్ ప్రెసిడెంట్‌గా పాపి నాయుడు, పాపారావు, ఆమోస్ సహాయ కార్యదర్శులుగా రమేష్, పండు, టి.ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ అమర్ కుమార్, జె.గోపి ప్రకటించారు.

హక్కులపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హక్కులపై దివ్యాంగులు అవగాహన కలిగి ఉండాలని దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రతినిధులు అన్నారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రతినిధులు శుక్రవారం స్థానిక ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. దగ్గర రక్త సంబంధీకులతో వివాహం (రక్త సంబంధ) చేయొద్దని, బాల్య వివాహాలు, గర్భధారణ వద్దని సూచించారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం దివ్యాంగులను 21 రకాలుగా గుర్తించారని తెలిపారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, డీడీఆర్‌సీ కేంద్రం ద్వారా క్యాంపులు నిర్వహించి దివ్యాంగుల గుర్తింపుకు సర్వేలు చేయటం, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ, ఆడియోలాజి, సైకాలజీ సేవలు ఉచితంగా అందిస్తామని వివరించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 08812 249297, 7386565469లో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెల్లి, అనుబంధ కులాల ర్యాలీ



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న రెల్లి నాయకులు, ప్రజలు

ఏలూరు (టూటౌన్): ఎస్సీల్లో వెనుకబడిన రెల్లి, దాని అనుబంధ కులాలకు ఎస్సీ వర్గీకరణలో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సంబంధిత కులాల నాయకులు, ప్రజలు ర్యాలీగా శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఏక సభ్య కమిషన్ ఆర్ఆర్ మిశ్రాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న అవకాశాలలో రెల్లి కులాల వారికి శాస్త్రీయ బద్ధంగాగాని, హేతుబద్ధంగా గానీ సామాజిక న్యాయం జరగలేదని వాపోయారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు బంగారు రజనీ కుమార్, నాయకులు కె.అశోక్ కుమార్, బి.దుర్గా మల్లేశ్వరరావు, బి.సుధాకర్, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

1,269 అర్జీలకు పరిష్కారం

ఏలూరు(మెట్రో) : ఏలూరు జిల్లాలో 408 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, 4,314 అర్జీలకు 1,269 అర్జీలు పరిష్కరించామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో శుక్రవారం నిర్వహించిన 34 రెవెన్యూ సదస్సుల్లో 947 మంది ఆయా సమస్యలపై 313 అర్జీలను అందజేశారని, వీటిలో 81 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారని వివరించారు. అర్జీలను 45 రోజులలోగా పరిష్కరిస్తామని తెలిపారు.

ఎక్కడి పనులు అక్కడే

- నిలిచిన ప్రభుత్వ బడుల అభివృద్ధి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ 4.1 కోట్లు మంజూరు



నిలిచిపోయిన చాటపర్రు జెడ్పీ పాఠశాల పనులు



అసంపూర్తిగా చాటపర్రు జెడ్పీ పాఠశాల తరగతి గది



నిధులు లేమితో నిలిచిపోయిన ప్రత్తికోళ్లలంక జెడ్పీ పాఠశాల ప్రహరీ పనులు

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలయినప్పటికీ ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతి గదులు మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయి. ప్రహరీలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల కోసం అధికారులచే అంచనాలు వేయించారు. కాని నేటికీ ప్రభుత్వం ఒక్కపైసా కూడా మంజూరు చేయలేదు. వైఎస్సార్ సీపీ హయంలో నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులు చురుగ్గా సాగాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు నిలిచిపోయాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు నేడు పథకంలో సుమారు రూ.4 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తంతో పాఠశాలల రూపురేఖలు మారాయి.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం

నాడు నేడు రెండో దశ పనుల్లో భాగంగా చాటపర్రు పాఠశాలకు వైఎస్సార్ సీపీ హయాంలో రూ.80 లక్షలు మంజూరు చేశారు. వీటితో ఫౌండేషన్, పిల్లర్లు, గోడల నిర్మాణం పూర్తిచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే గుడివాకలంక జెడ్పీ పాఠశాలకు మంజూరైన తరగతి గదుల సంఖ్యను కుదించారు. గత్యంతరం లేక పాఠశాల యాజమాన్యం మిగిలిన నిధులతోనే పనులు పూర్తి చేయాల్సింది. ప్రత్తికోళ్లలంక జెడ్పీ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ పనులు ముందుకు సాగడం లేదు. ప్రహరీ నిర్మించకపోవడంతో పాఠశాల ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. వరద, వర్షాల సమయంలో ఆట స్థలం మురుగునీటితో నిండిపోతుంది. తిమ్మారావుగూడెం, కాట్లంపూడి, మానూరు, మహేశ్వరపురం, శ్రీపర్రు గ్రామాల్లోని క్రైస్తవ మిషనరీ సంస్థలు నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులకు మంజూరైన మరుగుదొడ్ల నిధులు నిలిచిపోయాయి.

గతమెంతో ఘనం

గత ఐదేళ్లు ప్రభుత్వ పాఠశాలలకు స్వర్ణయుగం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో రూ.4.1 కోట్లు విడుదల చేసింది. తొలి విడత రూ.2.6 కోట్లు, రెండో విడత 1.95 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంతో 9 పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. తరగతి గదులను ఫ్లోరింగ్ చేశారు. బాలబాలికలకు డెస్క్ బెంచీలు అందుబాటులోకి వచ్చాయి. బ్లాక్ బోర్డులు పోయి ఆన్‌లైన్ పాఠాలు నేర్పే స్క్రీన్స్ వచ్చాయి. మరుగుదొడ్లు సైతం మెరుగుపడ్డాయి. పిల్లలు ఆడుకునేందుకు స్థలాలు, సురక్షిత తాగునీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్ సిస్టమ్స్ ఏర్పాటయ్యాయి. దీంతో పేదలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు క్యూ కట్టారు. నేడా పరిస్థితి లేదని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు.

అభివృద్ధి కొనసాగాలి



మా అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది. గత ప్రభుత్వం పాఠశాలలను బాగా అభివృద్ధి చేసింది. మరుగుదొడ్లు, తరగతి గదులు కట్టించింది. ఆ పనులు కొనసాగాలి. పేద పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. పిల్లలకు మరింత మెరుగైన వసతులు కల్పించాలి. నాణ్యమైన విద్య అందించాలి. అప్పుడు పేదలు విద్యావంతులుగా మారుతారు.

– ఎండీ సుభాని, ఏలూరు

పనులు నిలిచిపోయాయి



నేడు కొల్లేరు గ్రామాల్లో పాఠశాల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు విడుదల చేశారు. దీంతో పాఠశాల తరగతి గదులు నిర్మాణం ప్రారంభించారు. అధికారులు ఈ పనులు పూర్తి చేయాలి. ప్రభుత్వం మరిన్ని నిధులు విడుదల చేయాలి. లేకపోతే పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమైపోతారు.

– ముంగర సంజీవ్‌కుమార్, పైడిచింతపాడు

నేటి నుంచి శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు



స్వామివారి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆర్ఆర్‌పేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల ప్రారంభ సూచికగా శుక్రవారం ఏలూరు నగర వీధుల్లో స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాలతో మూడు వారాల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని ఆయన అన్నారు. తొలుత రథానికి ఆలయ అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రతేక పూజలు చేశారు. ఎస్ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా కార్యనిర్వహణాధికారి చనల్లూరి సతీష్ కుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జనవరి 2న లక్ష తులసి పూజ, 3న లక్ష కుంకుమార్చన, 5న సుదర్శన హోమం, 13న శ్రీ గోదా కల్యాణం నిర్వహిస్తారు. 18న ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి దర్బారు సేవ, రాత్రి శ్రీవారి పవళింపు సేవ నిర్వహించనున్నారు. ఆయా విశిష్ట పూజల్లో భక్తులు దేవస్థానం నిర్దేశించిన విరాళాలు చెల్లించి స్వయంగా భాగస్వాములు కావచ్చు. సప్తాహాలు సందర్భంగా నిత్యం సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిలో హరికథా కాలక్షేపాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రవచనాలు, నాదార్చనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భక్తి సంకీర్తనలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉన్నాయి.

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి



డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహరావుకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు జిల్లాలో ఇంజినీరింగ్ విభాగంలో పర్మినెంట్ కార్మికులుగా ఉన్న ఫిట్టర్లను టీప్ ఇన్‌స్పెక్టర్‌గా, వర్క్ ఇన్‌స్పెక్టర్లను అసిస్టెంట్ ఇంజినీర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఐటీఐ అర్హత గల కార్మికులను ఇంజినీరింగ్ విభాగంలో నాన్ పీహెచ్ వర్కర్స్‌గా తీసుకోవాలని, ఇంజినీరింగ్ విభాగంలో ఐటీఐ అర్హత గల వారికి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. చింతలపూడి నగర పంచాయతీ కార్మికులకు జీతాలు ఏరియర్స్ బకాయలు చెల్లించాలని, వేతనం రూ.21,000 చెల్లించాలని, మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగం ఇవ్వాలని, ఎస్ఎంఆర్ కార్మికులకు పర్మినెంట్ చేసి హెచ్ఆర్ఏ, డీఏతో కూడిన జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. మునిసిపల్ ఉద్యోగ కార్మికులకు 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న హెచ్ఆర్ఏ, డీఏ, సరెండర్ లీవ్స్, ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు.

రీసర్వే పైలెట్ ప్రాజెక్ట్‌గా కవ్వగుంట ఎంపిక

పెదవేగి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ రీసర్వేలో భాగంగా ఏలూరు జిల్లా పెదవేగి మండలం కవ్వగుంట పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని పెదవేగి తహసీల్దార్ ఎస్‌డీ భ్రమరాంబిక అన్నారు. శుక్రవారం కవ్వగుంటలో గ్రామ సభ, ర్యాలీ నిర్వహించారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామంలోని ప్రతి భూమిని ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా సర్వే చేసి రైతులందరికీ ఎల్పీ నంబర్లు ఇస్తామని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెజ్జు రామారావు, మండల సర్వేయర్ పీవీవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి బి హేమంతకుమార్, వీఆర్వో సీహెచ్ ప్రసాదరావు, వీలేజ్ సర్వేయర్ ఏ రాజశేఖర్, నాయకులు సుగసాని గంగాధర్‌రావు, కొట్టు నరేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	40
బెండకాయలు	32	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28–34	కంద	60
కాకర కాయలు	34–44	బీట్‌రూట్	50
బీరకాయలు	24	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	50	పాలకూర	10
బంగాళదుంపలు	30–36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	07
దోసకాయలు	32	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36